

సహజీవనానికి అడ్డొస్తున్నాడని హత్య

తన సహ జీవనానికి అడ్డు వస్తున్నాడని పేక్షావలీ అనే యువకుడిని జాఫర్‌వలీ అనే వ్యక్తి హత్య చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. -8లో



వైఎస్సార్‌సీపీ నాయకులకు స్విమ్స్‌లో వైద్య పరీక్షలు

వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న కేసులో బాధితులకు స్విమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.8/28.4

వాతావరణం

జిల్లాలో శనివారం 28.4 - 36.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 33.48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పలువురిని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. బద్వేల్‌కు చెందిన బీసీ సూరారెడ్డి, జమ్మలమడుగుకు చెందిన ఎంబీ శ్రీనివాసులరెడ్డి, కమలాపురానికి చెందిన షేక్ ఇస్మాయిల్ గఫారి, కిశోర్ బూసిపాటిలను రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఆమని



బ్రహ్మంగారి సన్నిధిలో సినీ యాక్టర్ ఆమని

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర సన్నిధిలో శనివారం సాయంత్రం సినీ యాక్టర్ ఆమని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి చిన్నకుమారుడు దత్తయ్యస్వామి దగ్గర ఉండి ప్రత్యేక పూజలు చేయించారు. ఈసందర్భంగా ఆమని మాట్లాడుతూ భవిష్యత్ కాలజ్ఞాన ప్రబోధకర్త సజీవ సమాధిని దర్శించుకోవాలన్న కోరిక నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక మఠాధిపతి వీరకుమార స్వామితో మాట్లాడి అమ్మవారి గురించి తెలుసుకున్నారు.

తిరుపతి-హిస్సార్ మధ్య ప్రత్యేక రైలు

- ప్రఖ్యాత సూఫీ క్షేత్రం అజ్మీర్ మీదుగా..

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప మీదుగా తిరుపతి-హిస్సార్ మధ్య ఈనెల 9 నుంచి సెప్టెంబరు 24వ తేది వరకు ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07717/07718 నెంబరుగల రైలు ప్రతి బుధవారం తిరుపతిలో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప (రాత్రి 2.30), ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు, మహబూబ్ నగర్, కాచిగూడ (మధ్యాహ్నం 3.50), నిజామాబాద్, నాందేడ్, పూర్ణ, సూరత్, వడోదర, చిత్రదుర్గ్, అజ్మీర్ (శనివారం ఉదయం 5.00), సికార్ జంక్షన్ మీదుగా హిస్సార్‌కు శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు చేరుతుందన్నారు. ఇదే రైలు ఈనెల 13 నుంచి సెప్టెంబరు 28 వరకు ప్రతి ఆదివారం హిస్సార్‌లో రాత్రి 11.15 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. 96 గంటల వ్యవధిలో.. 4000 కి.మీ దూరం ప్రయాణిస్తుందని.. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూపై నీలి నీడలు!

- శాశ్వత భవనాల కోసం గత ప్రభుత్వం 110 ఎకరాలు కేటాయింపు
- చంద్రబాబు సర్కార్‌లో విశ్వవిద్యాలయంపై వివపు కుట్రలు
- అగమ్య గోచరంగా విద్యార్థుల భవిష్యత్తు



ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు


సాక్షి ప్రతినిధి, కడప: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. సీఎం చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంతో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతులు దక్కలేదు. వెరసి విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. విశ్వవిద్యాలయానికి వైఎస్సార్ పేరు పెట్టడం కూటమి నేతలకు నచ్చలేదో లేక వైఎస్సార్ జిల్లాలో రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయం ఉండడం ఇష్టం లేదోగానీ వైఎస్సార్ ఏఎఫ్‌యూ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- జిల్లా కేంద్రమైన కడప నగరంలో 2020లో అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (జేఎన్‌యూ)కి సమాంతరంగా 14 రకాల స్పెషలైజ్డ్ కోర్సులతో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సమీపంలో ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ శాశ్వత భవనాల కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ 110 ఎకరాల భూమి కేటాయించింది. రూ.350 కోట్లతో విశ్వవిద్యాలయ శాశ్వత భవనాల కోసం ఆకృతులు సైతం సిద్ధం చేశారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో శాశ్వత భవనాలకు సంబంధించి ఒక్క అడుగు కూడా పురోగతి లేదు, తాత్కాలిక భవనాల్లో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

ప్ర'గతి' తప్పి..

వైఎస్సార్ ఏఎఫ్‌యూ స్థాపనతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ నేతృత్వంలో విశ్వవిద్యాలయ ప్రగతి పట్టాలెక్కింది. కోర్సులకు సంబంధించిన అనుమతులు, సిలబస్ రూపకల్పన, అధ్యాపకుల నియామకాలు తదితర కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కడప నగరంలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో తాత్కాలిక విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. దీంతోపాటు అన్ని కోర్సులకు సంబంధించి ఉన్నత విద్యామండలి గుర్తింపు, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌ల నుంచి గుర్తింపు సాధించే ప్రయత్నాలు ప్రారంభించి సఫలమయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ఏఎఫ్‌యూ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. సీఓఏ (కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్)అధికారులు సైతం గుర్తింపు ఇస్తామని ప్రకటించి సంబంధిత పత్రాలు పంపాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో స్పందన లేకపోవడంతో పలుమార్లు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి పరోక్షంగా విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారు.

శల్యసారథ్యం వహిస్తున్న సర్కార్



వైఎస్సార్ ఏఎఫ్‌యూపై రాష్ట్ర ప్రభుత్వం శల్యసారథ్యం వహిస్తుంది. వెరసి సీఓఏ గుర్తింపు ఇచ్చేందుకు నిరాకరించింది. అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ 2023 అక్టోబరులో విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ అధ్యాపక నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, అప్పట్లో టీడీపీ అండ్ కో విశ్వవిద్యాలయ నియామకాలపై కోర్టుకెళ్లి నియామక ప్రక్రియను నిలిపివేసింది. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో సీఓఏ గుర్తింపు నిచ్చేందుకు నిరాకరించింది. ఈ కారణంగా ఈఏడాది కోర్సు పూర్తి చేసుకోనున్న 63 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

- యూనివర్శిటీకి గుర్తింపు రాకుంటే వచ్చే ఏడాది 2027లో కోర్సు పూర్తి చేసుకునే విద్యార్థులకు సైతం ఇక్కట్లు తప్పవని పలువురు వివరిస్తున్నారు. కాగా, పాలకులు, అధికారులు స్పందించాల్సిందిపోయి విద్యార్థులకు ఉన్న వసతి గృహాలను సైతం ఖాళీ చేయించడం, మూసి వేయించడం, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు సైతం నిర్వహించకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. ఈ ఏడాది ఏడీసెట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు నిలిపివేయడం, విశ్వవిద్యాలయ ప్రాధాన్యత తగ్గించడం, తద్వారా ఇక్కడి నుంచి తరలించడమో, లేదా మూసివేయడమో చేయాలన్న కుట్ర కోణం దాగి ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు.

సీఓఏ గుర్తింపు ఇవ్వాలి



డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2020, 2021, 2022 మూడు బ్యాచ్‌లకు సీఓఏ గుర్తింపు ఇవ్వాలి. ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 వెంటనే నిర్వహించాలి. ఈ ఏడాది అడ్మిషన్లు తీసుకునే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉందో లేదో అర్థం కావడం లేదు. ఈ యూనివర్సిటీని ఏం చేయాలనుకుంటారో తెలియడం లేదు. -సాయిక్రిష్ణారెడ్డి, ఫైనలియర్ విద్యార్థి

పర్మినెంట్ వీసీ, రిజిస్ట్రార్‌లను నియమించాలి



ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి పర్మినెంట్ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులను నియమించాలి. సొంత భవనాలు, హాస్టల్ సదుపాయాలు కల్పించాలి. సీఓఏ కోసం నెలలు, సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నాం. గుర్తింపు వచ్చేంత వరకూ మేము పరీక్షలకు హాజరు అయ్యే ప్రసక్తే లేదు. -సుధాకర్, ఫైనలియర్ విద్యార్థి

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదు



ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదు. వెంటనే ఏడీసెట్ నిర్వహించాలి, సీఓఏ గుర్తింపు వచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి. ఈనెల 7 నుంచి ఎంసెట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత ఈ యూనివర్సిటీలో ఎవరు చేరుతారు. - సౌమ్య, విద్యార్థిని

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీపై కక్షసాధింపు తగదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి 110 ఎకరాల భూమిని కేటాయించి రిజిస్టర్ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యూనివర్సిటీ అభివృద్ధికి రూ.350కోట్లు మంజూరు చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.250కోట్లు మంజూరు చేయాలని పలుమార్లు కేంద్రానికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వం నియమించిన 47 డైలీ వేజ్ కార్మికులను, 135 మంది సిబ్బందిని తొలగించింది. దీన్నిబట్టే ఆర్కిటెక్చర్ యూనివర్సిటీపై కక్షసాధిస్తున్నట్లు అర్థమవుతోంది. - దేవిరెడ్డి ఆదిత్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

రేపు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక



పులివెందుల: మాజీ సీఎం ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటనకు రానున్నారు. సోమవారం సాయంత్రం పులివెందులకు చేరుకొని.. ఆ రోజు రాత్రి అక్కడే బస చేయనున్నారు. మంగళవారం ఉదయం మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయకు చేరుకుని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించనున్నారు. అక్కడ నుంచి పులివెందులకు చేరుకుని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలతో మమేకం కానున్నారు. అదే రోజు సాయంత్రం బెంగుళూరుకు బయలుదేరుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

రెండు రోజుల పర్యటన వివరాలు

వైఎస్ జగన్ ఈనెల 7న సాయంత్రం పులివెందులలోని భాకరాపురం హెలీప్యాడ్‌కు 5గంటలకు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి పులివెందులలో బస చేయనున్నారు. ఈనెల 8న ఉదయం 6.45గంటలకు పులివెందులలోని తన స్వగృహం నుంచి వాహనంలో రోడ్డు మార్గాన బయలుదేరి 7.30గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకుంటారు. 8.15గంటల వరకు ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 8.45గంటలకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుంటారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌లో ప్రజలతో మమేకం కానున్నారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరుతారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వీటిని భర్తీ చేస్తారని పేర్కొన్నారు. 25-45 ఏళ్ల వయసు కలిగిన వివాహిత అభ్యర్థినులు ఈ పోస్టులకు అర్హులని, పదో తరగతి ఉత్తీర్ణులై తెలుగు చదవడం, రా యడం తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు. గతంలో ఆశా కార్యకర్తలుగా పనిచేసిన వారికి ప్రాధాన్యముంటుందన్నారు. ఆసక్తి గల వారు కడప. ఏపీ. గవ్. ఇన్ వెబ్ సైట్ నుంచి దరఖాస్తు నమూనాను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జూలై 8 లోపు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు స్వయంగా అందజేయాలని సూచించారు.

పెద్దదర్గాకు ఉత్సవ శోభ



కడపలోని పెద్దదర్గా

- నేడు హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ గంధోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దర్గా నిర్వాహకులు

కడప సెవెన్‌రోడ్స్: దేశంలోనే ప్రసిద్ధిగాంచిన మహిమాన్విత సూఫీ క్షేత్రం కడప పెద్దదర్గా ఉత్సవ శోభ సంతరించుకుంది. దర్గాలో ప్రధాన గురువులైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ సాహెబ్ గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు దర్గా నిర్వాహకులు పూర్తి చేశారు. గంధోత్సవాన్ని దర్శించి తరించేందుకు శనివారం నాటికే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్గా ఆవరణకు చేరుకున్నారు.

తొలి గురువు నేపథ్యం

మహమ్మద్ ప్రవక్త వంశీయులుగా చెప్పబడే దర్గా తొలి గురువు హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ 16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ నుంచి కడపకు వచ్చారు. ప్రజలకు ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తుండేవారు. భగవంతుని దృష్టిలో మనుషులందరూ ఒక్కటేనని, కలిసిమెలిసి జీవించాలంటూ ఆయన ప్రబోధిస్తూ వచ్చారు. అనతి కాలంలోనే ఆయన మహిమలు, గొప్పతనం చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. ఆయన గొప్పతనాన్ని వినడమే కాకుండా ప్రత్యక్షంగా చూసిన సిద్దవటం నవాబు శిష్యునిగా మారారు. హజరత్ పీరుల్లామాలిక్ సాహెబ్ ఇక్కడే జీవ సమాధి పొందారు. సుప్రసిద్ధ హిందూ ధార్మికవేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు పద్మవిభూషణ్ పండిట్ రవిశంకర్ ఓమారు పెద్దదర్గాను దర్శించారు. దర్గా సందర్శన వల్ల తనకు ఎనలేని ఆత్మసంతృప్తి, ప్రశాంతత లభించాయని తెలిపారు. ప్రధాన గురువు మజార్ వద్ద ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉందన్నారు. దర్గా నిర్వాహకుల అనుమతితో ఆయన కాసేపు మజా ర్ వద్ద కూర్చొని ధ్యానంలో గడపడం విశేషం.

నేటి కార్యక్రమాలు .. హజరత్ ఖాజా సయ్యద్ షా పీరుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రి సాహెబ్ గంధం ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు గంధ మహోత్సవం జరగనుందని దర్గా ప్రతినిధులు తెలిపారు. మొహర్రం నెల 10వ రోజు గురువులు జీవ సమాధి పొందిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇంటింటా సౌర ఫలకరింపు

- సౌర విద్యుత్‌కు గరిష్టంగా రూ.78వేల వరకూ సబ్సిడీ
- వినియోగదారులు చేతినుంచి చెల్లించకుండా బ్యాంకు రుణం
- అప్లికేషన్ ఫీజు, మీటర్ వ్యయం పూర్తి ఉచితం





ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చిన దృశ్యం (ఫైల్)

కిలోవాట్	మొత్తం వ్యయం	ప్రభుత్వ సబ్సిడీ	వినియోగదారుని వాటా
1 కిలోవాట్	రూ.63వేలు	రూ.30వేలు	రూ.33వేలు
2 కిలోవాట్	రూ.1.26లక్షలు	రూ.60వేలు	రూ.66వేలు
3 కిలోవాట్	రూ.1.89లక్షలు	రూ.78వేలు	రూ.1.11లక్షలు

కడప కార్పొరేషన్: సౌర విద్యుత్ ఇంటికి కొత్త వెలుగులు తీసుకురానున్నాయి. ఆసక్తి ఉంటే చాలు వేలాది రూపాయల సబ్సిడీతో సౌర ఫలకలు ఇంటింటికీ పలకరించనున్నాయి. అవును.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా వినియోగదారులందరినీ సౌర విద్యుత్‌వైపు మళ్లించేందుకు విద్యుత్ శాఖ తమ వంతు బాధ్యతగా కృషి చేస్తోంది. సౌర ఫలకలు ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ ఇవ్వడంతోపాటు, మిగిలిన మొత్తానికి బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తున్నారు. ప్రతినెలా వినియోగదారులు చెల్లించే కరెంటు బిల్లుకు బదులుగా బ్యాంకుకు ఈఎంఐ చెల్లిస్తే నాలుగైదు ఏళ్లలోనే పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేస్తుంది. సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునే వారికి అప్లికేషన్ ఫీజు, మీటర్ ఖర్చులేకుండా పూర్తి ఉచితంగా ఇస్తున్నారు. రూ.2లక్షల వరకూ రుణం తీసుకునే వారికి బ్యాంకులు రూ.6.8శాతం వడ్డీతో ఈఎంఐలు చెల్లించే అవకాశం కల్పిస్తున్నాయి.

- ఉదాహరణకు ఒక వినియోగదారుడు తమ ఇంట్లో ప్రతినెలా 300 యూనిట్ల విద్యుత్‌ను వాడుతున్నట్లయితే అతనికి నెలకు రూ.1800 వరకూ బిల్లు వచ్చే అవకాశముంటుంది. ఆ లెక్కన ఏడాదికి అతను రూ.21,600 కరెంటు బిల్లు రూపేణా చెల్లించాలి. ఆ వినియోగదారుడు ప్రస్తుతం 2 కిలోవాట్ల సౌర ఫలకలు అమర్చుకుంటే అతనికి రూ.1.26లక్షల వ్యయం అవుతుంది. అందులో ప్రభుత్వం రూ.60వేలు సబ్సిడీ ఇస్తూ...మిగిలిన రూ.66వేలకు బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తుంది. ఈ రుణానికి 6.8 శాతం వడ్డీతో నాలుగేళ్ల కాలపరిమితిలో ఈఎంఐలు చెల్లించేలా ప్లాన్ చేసుకుంటే నెలకు రూ.1580 ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. అంటే వినియోగదారుడు నెలనెలా చెల్లించే రూ.1800 కరెంటు బిల్లు కంటే రూ.220లు తక్కువన్నమాట. సౌర ఫలకలు రోజుకు 10 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే నెలకు 300 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే విద్యుత్ కూడా సరిపడినంతగా లభిస్తుంది. ఇంతకంటే ఎక్కువ విద్యుత్ వాడకం ఉన్నవారు 3 కిలోవాట్ సౌర ఫలకలు అమర్చుకోవచ్చు. దానికి కూడా ఈఎంఐ కాలవ్యవధిని పెంచుకుంటే నెలకు రూ.1500 బ్యాంకు ఈఎంఐ చెల్లిస్తూ...మనం వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను తిరిగి విద్యుత్‌శాఖకే అమ్ముకునే అవకాశం ఉంటుంది.



గృహావసరాలకు విద్యుత్ శాఖ విధించే టారిఫ్‌లు (యూనిట్‌కు)


30 యూనిట్ల వరకూ:	రూ.1.10
31 నుంచి 75 యూనిట్ల వరకూ :	రూ.3.00
76 నుంచి 125 యూనిట్ల వరకూ:	రూ.4.50
126 నుంచి 225 యూనిట్ల వరకూ:	రూ.6.00
226 నుంచి 400 యూనిట్ల వరకూ:	రూ.8.75
400 యూనిట్ల పైన:	రూ.9.75

వ్యాపార అవసరాలకు విద్యుత్ శాఖ విధించే టారిఫ్‌లు (యూనిట్‌కు)

0-50 యూనిట్ల వరకూ:	రూ.5.40
50-100 యూనిట్ల వరకూ:	రూ.7.65
100-300 యూనిట్ల వరకూ:	రూ.9.05
600-500 యూనిట్ల వరకూ:	రూ.9.60
500 యూనిట్ల పైన:	రూ.10.15

(దీనికి అదనంగా నెలకు రూ.75లు వసూలు చేస్తారు)

పర్యావరణానికి చాలా ఉపయోగం



ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఇంటి పైకప్పు పైన సోలార్ ఫలకలు అమర్చుకుంటే పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు సహజ వనరులైన నీరు, బొగ్గు కొరత రాకుండా ఉంటుంది. వినియోగదారుడు ఎన్ని కిలోవాట్లయినా సౌర ఫలకలు అమర్చుకోవచ్చు. వారికి గరిష్టంగా రూ.78వేలు మాత్రమే సబ్సిడీ వస్తుంది. వినియోగదారులు ప్రతినెలా చెల్లించే విద్యుత్ బిల్లును బ్యాంకు ఈఎంఐ కడితే ఆ తర్వాత విద్యుత్ బిల్లు చెల్లించకుండా ఉచిత కరెంటు పొందవచ్చు.

– హరిసేవ్యా నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, కడప డివిజన్

ఆర్‌అండ్‌బీ 'ఐక్యూసీ' సర్కిల్ ఎస్ఈగా మధుసూదన్ రావు

కడప రూరల్: ఆర్‌అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ కడప (రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) ఎస్ఈగా డి.మధుసూదన్ రావు శనివారం బాధ్యతలు స్వీ కరించారు. ఈయన తిరుపతి ఆర్ అండ్ బి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తూ పదో న్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఈ యాప్‌పై ఓ లుక్ వేయాల్సిందే!

- లుక్ యాప్ పేరుతో భారీ దోపిడీ
- ఒకసారి డిపాజిట్ చేస్తే రోజూ డబ్బులు ఇస్తామని మోసం
- వెలుగులోకి వచ్చిన కొత్తరకం మోసం
- జిల్లా వ్యాప్తంగా 2వేల మంది బాధితులు
- రూ.30 కోట్లు దోపిడీ చేసినట్లు సమాచారం



ఖాజీపేట : ప్రతి మనిషికి ఆశ ఉంటుంది.. తక్కువ పెట్టుబడి డబ్బుతో ఎక్కువ లాభం వస్తుందంటే మనిషి కనీస వివేకం కోల్పోతాడు. మనుషుల్లోని ఈ బలహీనతను ఆధారంగా చేసుకుని లుక్ యాప్ ద్వారా భారీ దోపిడీ చేసిన సంఘటన కొత్తగా వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరాల పట్ల కేంద్ర ప్రభుత్వం ఎంతగా అవగాహన కల్పిస్తున్నా కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తూ అత్యాశాపరులను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే..

లుక్ యాప్ ద్వారా ఒక సారి డిపాజిట్ చేస్తే ప్రతిరోజు ఆదాయం పొందవచ్చన్న కొత్త రకమైన ఆలోచన ద్వారా సైబర్ నేరగాళ్లు కొత్త రకమైన యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్ గురించి వాట్సాప్ ద్వారా అలాగే వివిధ రకాల సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. రోజు వారి ఆదాయం వారంలో డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చని అందరిని బురిడీ కొట్టించారు. ఇదికాక ఒకరు డిపాజిట్ చేసిన తరువాత మరో 10 మందిని డిపాజిట్ చేయిస్తే వారి కి ప్రమోషన్ ద్వారా అదనపు ఆదాయం వస్తుందని మోసానికి పాల్పడ్డారు. అలాగే డిపాజిట్ చేసిన వ్యక్తి అమైంట్‌ను బట్టి వారికి రోజు ఆదాయం వస్తుందని ఆశ చూపించారు. ఇందులో రూ.2వేల నుంచి రూ.70లక్షల వరకూ డిపాజిట్ చేసే ఏర్పాట్లు చేశారు. డిపాజిట్ మొత్తాన్ని బట్టి రోజు వారి ఆదాయం గురించి వివరించారు. రూ.2వేలు డిపాజిట్ చేస్తే ప్రతి రోజు రూ.150, రూ.70వేలకు రోజుకు రూ.2500 ఇలా వివిధ కేటగిరీలను బట్టి రెండేళ్లపాటు ఆదాయం వస్తుందని నమ్మించారు. అలాగే వారంలో ఒకసారి వచ్చిన మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. మొదట్లో రెండు వారాలు అందరికి డబ్బులు బాగానే వేశారు. దీంతో నమ్మకం కలిగి చాలా మందిని ఈ లుక్ యాప్‌లోకి చేర్పించారు. సభ్యుల సంఖ్య వందల నుంచి వేలకు చేరింది.

25 నుంచి పని చేయని యాప్..

వందల సంఖ్య నుంచి వేల సంఖ్యలోకి చేరిన బాధితులు ఇలా లక్షల్లో యాప్‌లో డబ్బులు వేశారు. ఒక్క ఖాజీపేట మండలంలోనే 200 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు రూ.2వేల నుంచి సుమారు మూడు లక్షల రూపాయల వరకూ డిపాజిట్ చేసినట్లు సమాచారం. ఒక్క ఖాజీపేటలోనే రూ.20లక్షల నుంచి రూ.30 లక్షల డబ్బు డిపాజిట్ చేసి మోసపోయినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా 2వేల మందికి పైగానే బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తం చూస్తే సుమారు రూ.30 కోట్ల మేరకు డబ్బు డిపాజిట్ చేసి మోసపోయినట్లు అంచనా. పూర్తి స్థాయిలో విచారణ జరిగితే ఈ మొత్తం ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. కడపలోని ఒక్క వాట్సాప్ గ్రూప్ యాప్‌లోనే రూ.3కోట్లు పోయినట్లు సమాచారం. ఇలాంటి గ్రూపులు జిల్లాలో చాలా ఉన్నాయని తెలుస్తోంది. అయితే గత నెల 25 నుంచి సాంకేతిక కారణాలతో యాప్‌ను పూర్తిగా రద్దు చేసినట్లు బాధితులు వాపోతున్నారు. డిపాజిట్ సొమ్ముకు రోజువారి డబ్బు విత్‌డ్రా లేకపోవడం, యాప్ పనిచేయక పోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

తెర వెనుక ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు..

ఖాజీపేట మండలంలో ఈ యాప్ ద్వారా రోజువారి ఆదాయం వస్తుందని ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. అతని ద్వారా చాలా మంది అతని మాటలు నమ్మి ఈ యాప్‌లో డబ్బులు డిపాజిట్ చేసి మోసపోయినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఈ యాప్‌లోని డిపాజిట్ల బాగోతాన్ని ప్రచారం చేసి అందులో సభ్యులుగా అందరిని చేర్పించినట్లు బాధితులు చెబుతున్నారు. యాప్‌లో సభ్యులుగా చేర్పిన వారిని డబ్బుల విషయం గురించి అడిగితే తమకేం సంబంధం లేదన్నట్లు చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులకు సిద్ధం..

లుక్ యాప్ బాధితులకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో బాధితులంతా యాప్ ద్వారా మోసపోయిన తీరుపై చర్చించుకుంటున్నారు. అయితే ఈ యాప్‌లో అధికంగా 80 శాతం మహిళలు బాధితులుగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. అయితే చాలా మంది ఈ యాప్ వల్ల బాధితులం అని తెలిస్తే ఎక్కడ పరువు పోతుందో అని కేసు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. మరికొందరు మా ఖర్మ కొద్ది డబ్బులు పోగొట్టుకున్నాం ఎవ్వరికైనా తెలిస్తే పరువు పోతుంది ఎందుకులే అని వదిలేస్తున్నారు. ఇంకొందరు ఇప్పటికే సైబర్ పోలీసులకు నేరుగా, మరికొందరు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. లుక్ యాప్ మోసగాళ్లకు శిక్షపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

క్లుప్తంగా

భర్తపై వేధింపుల కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన నాగవేణి అనే మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు నాగవేణికి కడపకు చెందిన వెంకటసుబ్బయ్యతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన అతను గత 2 సంవత్సరాల నుంచి భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేని నాగవేణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలాజీ

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని టి. చదిపిరాళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం పట్టణం రాం నగర్‌కు చెందిన ముద్దల బాలాజీ (29) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడు మండలంలోని భారతి సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం బాలాజీ తన విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలోమార్గ మధ్యంలో టి.చదిపిరాళ్ల వద్దకు రాగానే కమలాపురం నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు చిన్న వయస్సు గల కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. బాలాజీ మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో జేసీ అదితి సింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10వ తేదీ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 2.ఓ నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం, ప్రతిభ వంటి అంశాలను తల్లిదండ్రులకు ఈ సందర్భంగా తెలియజేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థులు, టీచర్లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ పిల్లల విద్యా పురోగతిని తెలుసుకునేందుకు వీలుగా తల్లిదండ్రులకు సమగ్ర పురోగతి కార్డులను అందజేస్తామన్నారు. విద్యార్థులకు రోజూ అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆరోజు తల్లిదండ్రులకు కూడా వడ్డిస్తామని తెలిపారు. తమ తల్లికి నమస్కరిస్తూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. స్కూలు అభివృద్ధి కమిటీలు, పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యపై అధిక బడ్జెట్ కేటాయిస్తోందని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్స్, బ్యాగులు, పుస్తకాలు వంటివి అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం డేటా బేస్‌లో కేంద్రీయ విద్యాలయ పిల్లల పేర్లు లేకపోవడం వల్ల వారికి తల్లికి వందనం అందలేదని తెలిపారు. సాంకేతిక కారణాలను సరిదిద్ది మెగా పేరెంట్స్, టీచర్స్‌మీట్‌కు ముందే వీరందరికీ తల్లికి వందనం కింద సాయం అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఏడుగురి అరెస్టు

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. శనివారం కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలుల వెల్లడించారు. కడప నగరంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పలు చోట్ల దాడులు చేశామన్నారు. నగర శివారులోని ఊటుకూరు సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తు అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన కడియాల పవన్ కుమార్, మోటుపల్లి సతీష్ చంద్ర, కడప నగరానికి చెందిన నందిమండలం గణేష్ , సల్లా వినోద్, నారా యోగేష్‌లను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 1.20 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బద్వేలు ప్రాంతానికి చెందిన చిన్నం నాగేంద్ర వద్ద కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న చిన్నం నాగేంద్ర పరారీలో ఉన్నాడని త్వరలో ఇతన్ని కూడా అరెస్టు చేస్తామన్నారు. వీరిలో సల్లా వినోద్ పెయింటర్ పని చేస్తుండగా మిగిలిన నలుగురు నిందితులు చదువు మధ్యలో మానేసి ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిపారు. అలాగే మరొక గంజాయి కేసులో అప్సర సర్కిల్ వద్ద గంజాయి అమ్ముతున్న కడప నగరానికి చెందిన షేక్ గయూబ్ సాహెబ్ వలీ, గోపిరెడ్డి మునీశ్వర్ కుమార్ రెడ్డిలను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 1 కేజీ.100 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విద్యార్థులు, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐలు నరసింహారావు, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్రమణ్యం, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్
- నాలుగో రోజుకు చేరిన విద్యార్థుల రిలే నిరాహార దీక్షలు



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీ వద్ద విద్యార్థులు చేస్తున్న నాలుగో రోజు నిరవధిక నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని నెలకొల్పారన్నారు. గత ప్రభుత్వంలోనే జీఓ నంబర్–42 ద్వారా యూనివర్సిటీలో లెక్చరర్లు, ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆ పోస్టులను ఈ ప్రభుత్వం భర్తీ చేసి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ) పర్మిషన్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చొరవ చూపి సీఓఏ అనుమతి వచ్చేలా చర్యలు తీసుకొని యూనివర్సిటీకి కేటాయించిన స్థలం శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు.

మంత్రి లోకేష్ స్పందించపోతే పెద్ద ఎత్తున ఉద్యమం

విద్యార్థుల దీక్షలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి. సాయిదత్త, ఏఐఎస్‌ఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. వలరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి. రవి తదితరులు మద్దతు ప్రకటించి దీక్షల్లో కూర్చున్నారు. ఈ సమస్యపై మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు శివారెడ్డి, సాయి కుమార్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ శేఖర్ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, నగర కార్యదర్శి తేజ పాల్గొన్నారు. సాయిరెడ్డి, రామ్, మేఘసాయి, పవిత్ర, సుష్మ, సుధీర్, సుధాకర్, ఆదిత్య, వసంత్, సింధు, మోహన్, మనోజ్ దీక్షల్లో కూర్చున్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

కడప ఎడ్యుకేషన్ : ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల విద్యార్థి యువజన సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిని కలిసి వినతిప్రత్రం సమర్పించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఐక్యవేదిక నాయకులు ఎం.అంకన్న, సుబ్బారాయుడు, జయవర్ధన్, నాగరాజు, నాగేశ్వరరావు, మహేష్ ఉన్నారు.

సహజీవనానికి అడ్డొస్తున్నాడని హత్య

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర రావు

జమ్మలమడుగు : తన సహ జీవనానికి అడ్డు వస్తున్నాడని షేక్షావలీ అనే యువకుడిని జాఫర్‌వలీ అనే వ్యక్తి హత్య చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 1వ తేదీన ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు ఆవరణంలో జరిగిన షేక్షావలీ అనే యువకుడి హత్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరుకు చెందిన హసీనా భర్త 15 ఏళ్ల క్రితం మరణించాడు. ఆ తర్వాత ప్రొద్దుటూరుకు చెందిన జాఫర్‌వలీ అనే వ్యక్తి హసీనాతో గత కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. గత నెల 26వ తేదీన హసీనా కడపలో ఉన్న తన తల్లి ఇంటికి వెళ్లింది. జాఫర్‌వలీ ఆమె కోసం కడపకు వెళ్లాడు. అక్కడ ఉన్న హసీనా అన్న షేక్షావలీ నీవు ఇక్కడికి రావద్దు.. మా చెల్లెలిని వదలిపెట్టు అంటూ జాఫర్‌వలీని మందలించాడు. దీంతో షేక్షావలీపై జాఫర్‌వలీ కక్ష పెంచుకున్నాడు. తన సహ జీవనానికి అడ్డుగా ఉన్న అతన్ని అంతమొందించాలని పథకం పన్నాడు. అందులో భాగంగా ఈ నెల 1వ తేదీన జాఫర్‌వలి కడపలో షేక్షావలీ నివాసం ఉంటున్న వీధిలోకి వెళ్లాడు. అక్కడ ఎదురుపడిన షేక్షావలీతో జాఫర్ వలీ మాట్లాడి ఇద్దరం కలిసి మద్యం తాగుదాం రమ్మంటూ కడప రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం సేవించిన తర్వాత ఎర్రగుంట్లలో కుక్కలను పట్టుకుంటే ఒక్కో కుక్కకు రూ. 300 ఇస్తారని నమ్మించి షేక్షావలీని ఎర్రగుంట్లకు పిలుచుకుని వచ్చాడు. కడప రోడ్డులో ఉన్న బ్రాందీ షాపులో తిరిగి మద్యం తాగారు. తర్వాత ఎర్రగుంట్ల పట్టణంలోని మార్కెట్ యార్డులో పాత గోడౌన్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశానికి వచ్చారు. పథకం ప్రకారం తక్కువ మోతాదులో మద్యం తాగిన జాఫర్‌వలీ మద్యం మత్తులో పడిపోయిన షేక్షావలీ తలపై అక్కడ ఉన్న ఇటుక, బండరాళ్లతో కొట్టి హత్య చేశాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎర్రగుట్ల సీఐ నరేష్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు జాఫర్‌వలీని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన సీఐ నరేష్‌బాబుతో పాటు మరి కొందరు కానిస్టేబుళ్లను అభినందిస్తూ రివార్డులను అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు స్విమ్స్‌లో వైద్య పరీక్షలు

- టీడీపీ తోరణాల తొలగింపు ఘటనలో అక్రమ కేసు
- పోలీసుల థర్డ్‌డిగ్రీపై హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- తిరుపతి స్విమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిన హైకోర్టు



స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ రిపోర్టు చూపుతున్న బాధితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడపలో మహానాడు సందర్భంగా టీడీపీ నాయకులు పులివెందులలోని రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ తోరణాలు, జెండాలు కట్టిన విషయం విదితమే. దీనిపై అప్పట్లో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు పులివెందుల డీఎస్పీని, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి టీడీపీ తోరణాలు తొలగించాలని వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించకపోవడంతో మున్సిపల్ చైర్మన్‌తోపాటు ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న తోరణాలను తొలగించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసు

అప్పట్లో జిల్లాలో ఉన్న హోం శాఖ మంత్రి అనిత, పులివెందుల టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు పోలీసులు దాదాపు 18 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వీరిలో 13 మందిని అరెస్టు చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. అనంతరం వారిని పులివెందుల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అక్కడ వైఎస్సార్ సీపీ నాయకులు పార్నపల్లె కిశోర్, సాతుపాటి రాజేష్, తావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లి వెంకట చలపతి, సాతుపాటి వెంకటపతిలు తమను పోలీసులు అకారణంగా కొట్టారని మెజిస్ట్రేట్ ఎదుట వాపోయారు. దీంతో పులివెందుల మెజిస్ట్రేట్ వారికి పులివెందుల గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

రిపోర్టుల్లో అవకతవకలు

అప్పట్లో పులివెందుల మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆరుగురికి పులివెందుల జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలనివేదికల్లో అనేక అవకతవకలు జరిగాయని సమాచారం. వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో వైద్యులు, సూపరింటెండెంట్‌పై పులివెందుల పోలీసులు అధికార పార్టీ నాయకులచే ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా నివేదికలు తయారు చేసుకున్నారు. దీంతో ఆరుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు వైద్య పరీక్షల నివేదికను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటీషన్ వేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఆరుగురికి మరలా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి కేంద్రంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐలు చాంద్‌బాషా, వెంకట రమణ పెద్ద ఎత్తున పైరవీలు చేశారు. వీరు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మంతనాలు జరపడం మీడియా సాక్షిగా బయట పడింది. అంతేకాకుండా కర్నూలు డీఎస్పీ కూడా తమకేమాత్రం సంబంధం లేకున్నా ఆస్పత్రికి వెళ్లి నివేదికలను మేనేజ్ చేసినట్లు సమాచారం. ఈ పరిస్థితిలో మరలా ఆరుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు తమకు జరిగిన అన్యాయంపై సాక్ష్యాధారాలతో హైకోర్టుకు నివేదించి ప్రైవేటు కంప్లైంటు వేశారు. దీంతో హైకోర్టు మరలా వీరికి తిరుపతి స్విమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని పులివెందుల అర్బన్ సీఐ చాంద్‌బాషాను ఆదేశించింది.

స్విమ్స్‌లోనైనా న్యాయం జరిగేనా..!

హైకోర్టు ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులను శనివారం ఉదయం 7 గంటలకు పులివెందుల నుంచి అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, రూరల్ సీఐ వెంకట రమణలు నివేదికలు తమకు అనుకూలంగా ఉండాలని మేనేజ్ చేసినట్లు సమాచారం. నిష్పక్షపాతంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని అధికార పార్టీ నాయకులతో స్విమ్స్ ఆస్పత్రి పెద్దలపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రస్తుతం రక్త పరీక్షలు నిర్వహించి మిగిలిన పరీక్షలు తర్వాత నిర్వహిస్తామని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. ఇక్కడైనా తమకు న్యాయం జరగాలని బాధితులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ఏసీఏ అండర్–19 మల్టీడే మ్యాచ్‌లు



వీరారెడ్డి, అనంతపురం (251 పరుగులు)



జయంత్‌కృష్ణ అనంతపురం (79 పరుగులు)



మహిత్, కర్నూలు (5 వికెట్లు)



సిద్దు, చిత్తూరు (74 పరుగులు)



భార్గవ్ మహేష్ నెల్లూరు, (5 వికెట్లు)

- 251 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మన్ కేహెచ్ వీరారెడ్డి
- 486 పరుగుల భారీ స్కోరు చేసిన అనంతపురం జట్టు

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ డే మ్యాచ్‌లు రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టు భారీ స్కోరు చేసింది. శనివారం రెండవ రోజు 139 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 82.2 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని కేహెచ్ వీరారెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ చేసి 267 బంతుల్లో 30 ఫోర్లు, 12 సిక్సర్లతో 251 పరుగులు చేశాడు. జయంత్ కృష్ణ 79 పరుగులు, సందీప్ రెడ్డి 55 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని మహిత్ తన చక్కటి లైనప్‌తో బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. భార్గవ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. ఆ జట్టులోని టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ స్టేడియంలో..

అదే విధంగా వైఎస్‌ఆర్‌ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెండవ రోజు 14 పరుగుల ఓవర్ నైట్ స్కోరు తొలి ఇన్నింగ్స్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 69.1 ఓవర్లలో 318 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సిద్దు 74 పరుగులు, వరుణ్ 64 పరుగులు, సాయి చరణ్ 60 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 63 పరుగులు చేసింది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

జాతీయ లోక్ అదాలత్‌లో 18000 కేసులకు పరిష్కారం

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 18000 కేసులు పరిష్కరించారు. రూ. 14,03,00,338 మొత్తం కక్షిదారులకు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన న్యాయవాదులకు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.